సాక్షి శ్రీకాకుళం

గురువారం । 29 । ఆగస్టు । 2024



నీటిమూటలేనా!

క్రీడాభివృద్ధి కుంటుపడుతోంది. పాలకులు హామీ లిచ్చి గాలికొదిలేస్తుండటంతో క్రీడాకారులకు ప్రోత్సాహం లేకుండాపోతోంది.

- 8లో



మెనూ.. గాడి తప్పెను!

ఆర్‌జీయూకేటీలో భోజన మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో

బీటెక్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మూడు, ఐదు సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం విడుదల చేశారు. జ్ఞాన భూమి పోర్టల్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచారు. మూడో సెమిస్టర్‌లో 293 మందికి 110 మంది, ఐదో సెమిస్టర్‌లో 192 మందికి 63 మంది ఉత్తీర్ణత సాధించారు.



కఠినంగా శిక్షించాలి

పీహెచ్‌సీలో రాత్రి విధులు నిర్వహించే మహిళా సిబ్బంది కోసం ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేయాలి. ముఖ్యంగా ఊరికి దూరంగా ఉంటున్న పీహెచ్‌సీల్లో రాత్రివేళ ఒంటరిగా విధులు నిర్వహించాలంటే భయంగానే ఉంటుంది. పోలీసు గస్తీ వంటి చర్యలు చేపట్టి ధైర్యం కల్పించాలి. ఆసుపత్రి సిబ్బందిపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి.

– జి.సుశీల, స్టాఫ్‌నర్స్, నందిగాం పీహెచ్‌సీ



భరోసా ఇవ్వాలి

ఆస్పత్రిలో మహిళా వైద్యులకు భద్రత కల్పించాలి. రాత్రి వేళ సేవలందించే సిబ్బందికి పోలీస్ రక్షణ కల్పించాలి. కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వైద్యులు, వైద్య సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వహించేలా భరోసా కల్పించాలి.

– డాక్టర్ జి.షిబాణి, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ, పాతపట్నం



స్వేచ్ఛనివ్వాలి

వైద్యులు సొంత కుటుంబ సభ్యుల్లా రోగులకు సేవలందిస్తారు. అటువంటి వారిని స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలి తప్ప దాడులకు పాల్పడకూడదు.

– డాక్టర్ అల్లు పద్మ, సూపరింటిండెంట్, పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం

రక్షణ కల్పించాలి

కోల్‌కతా ఆసుపత్రిలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారం బాధాకరం. ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు డాక్టర్లు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఎంతో మంది ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా? రాత్రి వేళ భద్రతా ఏర్పాట్లు చేయాలి.

– డాక్టర్ వాన దేవిక, సారవకోట పీహెచ్‌సీ



యథేచ్ఛగా కబ్జాకాండ

- టీడీపీ అధికారంలోకి వచ్చాక మళ్లీ కబ్జాలకు తెరతీసిన పచ్చనేతలు
- 2014–19లో చేసిన అక్రమాలకు గత ప్రభుత్వంలో చెక్
- ప్రభుత్వం మారగానే రంగంలోకి దిగిన తెలుగు తమ్ముళ్లు
- చెరువులు, ప్రభుత్వ భూములు, డీ పట్టా భూములే లక్ష్యంగా పావులు

మళ్లీ తమ్ముళ్ల దందా



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆక్రమణల పర్వానికి అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. చెరువులు, కొండలు, గోర్జి భూములు, ప్రభుత్వ సంస్థల భూములు, దళితులకిచ్చిన డి పట్టా భూమలని చూడకుండా కన్నేసి కబ్జా చేయడం ప్రారంభించారు. ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రి జేసీబీ, ప్రొక్లెయినర్లు తీసుకొచ్చి ఆక్రమిత భూములను చదును చేస్తున్నారు. గతంలో ఆక్రమించిన భూములపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండగా అడుగు పెట్టేందుకు భయపడిన తెలుగు తమ్ముళ్లు టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ ఆక్రమణలపై 'దృష్టి' సారించారు. జిల్లాలో ప్రతీచోట ఆక్రమణల వ్యవహారాలు బయటికొస్తున్నాయి. కొందరు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తుండగా, కొన్నిచోట్ల బాధితులు నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. చెరువులను ఆక్రమిస్తే భవిష్యత్‌లో వరద పోటు ఉంటుందని తెలిసినా తగ్గడం లేదు. కప్పేసి, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా వేసుకోవడానికి దూకుడుగా వెళ్తున్నారు. అధికారులు సైతం తాము చెప్పినట్టు వింటారని...వినకపోతే వారికిక్కడ పోస్టింగ్ ఉండదని.. కబ్జాలకు అడ్డుకట్ట వేసేవారుండరని అధికార మదంతో ప్రభుత్వ భూములపైన, దళితుల భూములపైన పడుతున్నారు.



ఎచ్చెర్ల గ్రామ పరిధిలో ఉన్న ఈ భూమి ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. సర్వే నంబర్ 12–1లో ఉన్న ఈ భూమి.. చెరువును ఆక్రమించి చౌదరి నారాయణమూర్తి కుటుంబ సభ్యులు గుప్పెట్లో పెట్టుకున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు గత జాయింట్ కలెక్టర్ నవీన్ విచారణ జరిపించారు. ఎస్‌ఎల్‌ఆర్‌లోనూ, 2011–12అడంగల్‌లోనూ, 1959 ప్రొసీడింగ్ ఆఫ్‌ది అసిస్టెంట్ సెటిల్‌మెంట్ ఆఫీస్‌లో చెరువుగానే పేర్కొని ఉందని విచారణలో గుర్తించారు. టీడీపీ అధికారంలో ఉన్న 2014–19 మధ్య టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి పేరును రికార్డుల్లోకి ఎక్కించుకుని, అక్రమంగా అనుభవిస్తున్నారని తేలింది. దీంతో రికార్డుల్లో ఉన్న చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ)ను తొలగించి సరిదిద్దారు. ఇంతలోనే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో చౌదరి బాబ్జీ ఆ భూములకు సంబంధించి హైకోర్టు తమకు అనుకూల ఉత్తర్వులిచ్చిందని పేర్కొంటూ సాగులోకి తెచ్చుకున్నారు.

టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు యత్నించిన దళితుల డీపట్టా భూమిది. సర్వే నంబర్. 467లో 3బీలో ఉన్న ఎకరా 30 సెంట్లు భూమిని సింగుపురం పంచాయతీ మునసబుపేటకు చెందిన ధనాల తేజ కుటుంబీకులకు అప్పటి ప్రభుత్వం డీ పట్టా భూమిగా ఇచ్చింది. వారు పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడంతో స్థానికంగా ఎవరూ లేని సమయాన్ని చూసి కొందరు టీడీపీ నాయకులు 92 సెంట్లలో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్లాట్స్ వేయడానికి ప్రయత్నించారు. దీనిపై బాధితులు రూరల్ పోలీసులకు, మీకోసం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.





ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎం పురంలో గురుకుల పాఠశాల భూముల్లో దాదాపు రెండు ఎకరాలను కొందరు టీడీపీ నాయకులు అక్రమంగా చదును చేసి ఆక్రమణలోకి తెచ్చుకున్న ప్రదేశమిది. సర్వే నంబర్ 112 సబ్ డివిజన్ 635/2లో గల 54 ఎకరాలు భూములుండగా, వాటిలో 2014–19లో టీడీపీ ప్రభుత్వం ఉండగా కొంత భూమిని ఆక్రమించి నీలగిరి మొక్కలు వేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆక్రమణదారులు సైలెంట్‌గా ఉన్నారు. తాజాగా టీడీపీ మరోసారి అధికారంలోకి రావడంతో ఆ గురుకుల పాఠశాల భూములపై మళ్లీ కన్నేశారు. ఈ క్రమంలో రెండెకరాల వరకు కొండలరావు, మహేష్, గణపతిరావు, గోవిందరావు తదితరులు అక్రమంగా చదును చేసి, ఆక్రమిత భూమిలో స్తంభాలు పాతారు.

టీడీపీ నాయకులు అక్రమించేందుకు యత్నించిన మల్లి పెద్దవాని చెరువు ఇది. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరులోని సర్వే నంబర్ 39లో 2.61ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. సుమారు రూ.5కోట్ల విలువైన ఈ చెరువు భూమిపై టీడీపీ నేతల కన్ను పడింది. గతంలో ఒకసారి ఆక్రమించేందుకు యత్నించగా సఫలం కాలేదు. టీడీపీ అధికారంలోకి రాగానే మళ్లీ ఆక్రమణదారుల దృష్టి చెరువుపై పడింది. రాత్రివేళ జేసీబీ, ప్రొక్లెయినర్‌తో చెరువును కప్పేసే ప్రయత్నం చేశారు. దీనిపై 'సాక్షి'లో కథనం రావడం, స్థానికులు ఫిర్యాదు చేయడంతో టీడీపీ నాయకులు యత్నాలు బెడిసికొట్టాయి. తప్పనిపరిస్థితుల్లో అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని ఆక్రమణను కట్టడి చేసింది.





టీడీపీ నాయకుల ఆక్రమించిన దళితుల భూమిది. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం పంచాయతీ బైరినాగులపేట గ్రామానికి చెందిన ధనాల రామప్పడు పేరిట 1975లో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో డీపట్టా వచ్చింది. పాత సర్వే నంబర్ 1204, కాగా కొత్త సర్వే నంబర్ 133–4లో గల 65 సెంట్ల భూమి గత 49 ఏళ్లుగా ఆ కుటుంబం అనుభవంలోనే ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక కొంత మంది పచ్చ నాయకులు రాత్రికిరాత్రే జేసీబీ పట్టుకొని వచ్చి పొలం అంతటినీ ధ్వంసం చేశారు. కంచెతో సహ స్తంభాలను పీకి పారేశారు. లక్ష రూపాయలు పెట్టి వేసిన బోరు సైతం తొలగించి ఆక్రమంగా పొలంలోకి చొరబడి విధ్వంసం చేయడంతో తమకు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు శ్రీకాకుళం రూరల్ పోలీసులకు, ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేశారు.



పూండి– గోవిందపురం పరిధిలోని టీడీపీ నాయకుల ఆక్రమణలో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూమిది. సర్వే నంబర్ 64, సబ్ డివిజన్‌లలో 2.52 ఎకరాల స్థలం ఉండగా, ఇందులో ఎకరా వరకు జిరాయితీ ఉంది. మిగతాది ల్యాండ్ సీలింగ్ భూమి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో ఎకరా 49సెంట్లు ప్రభుత్వ భూమిగా తేలింది. కానీ, జిరాయితీ సర్వే నంబర్‌తో ఫేక్ నంబర్లు సృష్టించి ల్యాండ్ సీలింగ్ భూమిని ఆక్రమించడమే కాకుండా అక్రమ రిజిస్ట్రేషన్లు కూడా చేసేశారు. టీడీపీ నాయకులు ఈశ్వరరావు, వెంకటయ్య కుటుంబీకులు, దానేష్, జనార్దనరావు, బృందరావు, వెంకటరావు, సతీష్‌తో పాటు మరికొందరు ఈ దందాలో పాలు పంచుకున్నారు. గతంలో చాలా వరకు జరిగినా తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో ఇంకా మిగిలి ఉన్న 50 సెంట్ల భూమిని ఆక్రమించుకునేందుకు మరో టీడీపీ నేత యత్నిస్తున్నారు.



రొయ్యకి రేటొచ్చింది



ఆక్వా అ'ధర'హో!

- 100 కౌంట్ ధర రూ.255కు చేరటంతో రైతుల్లో ఆనందం
- ఏడాది కాలంలో వనామీకి ఇదే అత్యధికం
- సీఫుడ్ ఎగుమతుల డిమాండ్‌తో పెరిగిన ధర



ఎగుమతులకు సిద్ధంగా ఉన్న వనామీ రొయ్యలు

పోలాకి:

ఎట్టకేలకు ఆక్వా రైతులకు ఉపశమనం లభించింది. పెరిగిన పెట్టుబడులు, ప్రతికూల పరిస్థితులతో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న రొయ్యల రైతులకు తాజాగా పెరిగిన కౌంట్ ధర నూతనోత్సాహాన్ని నింపింది. ఏడాది కాలం తరువాత వనామీ రొయ్య మళ్లీ మంచి ధర పలికింది. 100 కౌంట్ ధర రూ.255 నుంచి రూ.260 వరకు పలుకుతుండటంతో పెంపకందారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంతో ఆక్వా ధరలు భారీగా పడిపోయినపుడు రైతులను ఆదుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చట్టాన్ని(అప్సడా)తెచ్చి 100 కౌంట్ కనీస ధర రూ.210 అందేలా చర్యలు తీసుకున్న విషయాన్ని ఆక్వారైతులు గుర్తు చేసుకుంటున్నారు.



పెరిగిన ధరలు వివరాలు	
100 కౌంట్	రూ.255
90 కౌంట్	రూ.265
80 కౌంట్	రూ.275
70 కౌంట్	రూ.295
60 కౌంట్	రూ.315
48–50 కౌంట్	రూ.335
46–47 కౌంట్	రూ.340
43–45 కౌంట్	రూ.345

దిగుబడి తగ్గడంతో డిమాండ్..

ఆక్వా రంగంలో ఇటీవల ఎదురవుతున్న ఒడిదొడుకుల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. దీంతో సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్‌కు డిమాండ్ పెరిగి ధరలు పెరగడానికి కారణమైంది. మరోవైపు వ్యాధుల తీవ్రత, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రొయ్యలకు ధరలు పెరిగినా దానికి తగినట్లుగానే అదనపు పెట్టుబడులు సైతం పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. దేశీయంగా బ్రూడ్‌స్టాక్ (తల్లిరొయ్యలు) దిగుమతులు గణనీయంగా తగ్గిపోయేంతగా ప్రభావితం చేసిందని అంటున్నారు. ఏదిఏమైనా చాలా కాలం తర్వాత రొయ్యలకు ధర పెరగటంపై ఆక్వా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

చాలాకాలం తర్వాత..



వనామీ రొయ్యలకు చాలా కాలం తరువాత ధర పెరిగింది. ఆక్వా కల్చర్ రన్నింగ్‌లో వున్నవారికి ఇది మంచి అవకాశం. పెరిగిన పెట్టుబడుల కారణంగా ఈ స్థాయిలో ధరలు లేకపోతే సాగు గిట్టుబాటు కావడం లేదు.

– సాహుకారి శ్రీనివాసరావు, ఆక్వా రైతు, డీఎల్‌పురం

కనీస ధరలు కొనసాగాలి..



రొయ్యలసాగు చేసే రైతులకు ధరలు పలికినపుడు దిగుబడులు రావటం లేదు. దిగుబడులు ఉన్నపుడు ధరలు ఉండటం లేదు. గత ప్రభుత్వం మాదిరిగానే కనీస ధరలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

– పల్లి సింహాచలం, ఆక్వారైతు, బెలమర

ఎక్స్‌పోర్ట్స్ డిమాండ్‌తోనే..



దేశీయమార్కెట్‌లో సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్‌కు డిమాండ్ పెరగటంతోనే ధరలు పెరిగాయి. బ్రూడ్‌స్టాక్ దిగుమతులు తగ్గటంతో నాణ్యమైన రొయ్యపిల్లలు రైతులకు లభించే పరిస్థితి లేదు. దీంతో దిగుబడి భారీగా తగ్గింది.

– జి.విద్యాధరరావు, ఏరియా సేల్స్ మేనేజర్, ఏడీఎం ఆగ్రో ఇండస్ట్రీస్

ఆక్వా రైతులు	రొయ్యల సాగు విస్తీర్ణం	ఎగుమతులు (ఏడాదికి)
340 మంది	5750 ఎకరాలు	30 వేల మెట్రిక్ టన్నులు

ఎలుకల నిర్మూలనకు చర్యలు



నరసన్నపేట: తామరాపల్లి మహిళా రెసిడెన్షియల్ కళాశాలలో ఎలుకల నిర్మూలనకు ప్రిన్సిపాల్ కృష్ణతార బుధవారం చర్యలు చేపట్టారు. మంగళవారం డార్మిటరీలో ఉన్న ఐదుగురు ఇంటర్ విద్యార్థినులకు ఎలుకలు కరిచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎలుకలు లోపలికి రాకుండా మెస్ ఏర్పాటు చేశారు. ఎలుకల దాడిలో గాయపడిన వారూ ఆరోగ్యంగా ఉన్నారని, మరోసారి ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పది రోజుల్లో పనులు పూర్తవ్వాలి



మెళియాపుట్టి: ఏకలవ్య పాఠశాలలో పనులు పూర్తి చేసి పది రోజులలో వినియోగానికి తీసుకురావాలని సీతంపేట ఐటీడీఏ పీఓ వి.వి.రమణ అధికారులను ఆదేశించారు. బుధవారం మెళియాపుట్టి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవన సముదాయాలను పరిశీలించారు. పనులు జాప్యం జరగడానికి గల కారణాలపై ఆరా తీశారు. పాఠశాల వినియోగానికి తీసుకురాకపోతే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

డీజీపీని కలిసిన ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్ : డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావును జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం విశాఖపట్నం వచ్చిన డీజీపీని విశాఖ పోలీసు అధికారుల అతిథిగృహం వద్ద కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా పరిస్థితిని డీజీపీకి వివరించారు.

- ఎరువుల పంపిణీలో ఘోరంగా విఫలమయ్యారు
- అధికారులను నిలదీసిన పాలక, విపక్ష సభ్యులు
- వాడీవేడిగా జెడ్పీ సమావేశం

రైతులు గగ్గోలు పెడుతుంటే.. అధికారులు ఏం చేస్తున్నారు?





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ. హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా పరిషత్ సమావేశం వాడీవేడిగా సాగింది. ఎరువుల కొరతపై అధికార, విపక్షాలు మండిపడ్డాయి. రైతులకు అన్యాయం జరిగిందని అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఒప్పుకునే పరిస్థితి చోటు చేసుకుంది. యంత్రాంగం వైఫల్యంగా అధికార పక్షం ఎత్తి చూపింది. సాగునీటి పైనా ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. అధికారుల తీరుపై విరుచుకుపడ్డారు. అధికార పక్షమే విపక్షంగా జెడ్పీ సమావేశంలో మాట్లాడి.. ఈ ప్రభుత్వ వైఫల్యాలను పరోక్షంగా ఎత్తి చూపినట్టు అయింది. మొత్తమ్మీద జెడ్పీ సమావేశం ఆద్యంతం హాట్ హాట్‌గా సాగింది.

అభివృద్ధికి సహకరించాలి..

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్ బుధవారం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ప్రాధాన్యమున్న అంశాలనే చర్చించాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, కాంప్లెక్స్ ఎరువులు రైతుభరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందేవని గుర్తు చేశారు. గతంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విలేజ్ క్లినిక్, అర్బన్‌హెల్త్ సెంటర్ల ద్వారా చర్యలు తీసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీరందించక, విత్తనాలు అందించక, ఎరువులు ఇవ్వక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఎరువులివ్వడంలో ఫెయిల్..

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ఎరువులు ఇవ్వడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారని, ఈ విషయంలో వ్యవసాయాధికారులు పూర్తిగా ఫెయిలయ్యారని మండిపడ్డారు. ఇంతలో అధికారులు స్పందిస్తూ ఎరువులు ఇస్తున్నామని చెప్పడంతో ఎమ్మెల్యే మరింత కోపోద్రిక్తుడయ్యారు. ఎరువులిస్తే రైతులు ఎందుకు గగ్గోలు పెడుతున్నారని ప్రశ్నించారు. ప్రైవేటు డీలర్లకు ఎరువులు అప్పగించి అధిక ధరలకు అమ్ముతున్నా వ్యవసాయాధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. సీజన్ అయ్యాక ఎరువులు ఇస్తే ప్రయోజనమేంటన్నారు. ఇరిగేషన్ అధికారులు నీరివ్వడంలోనూ విఫలమయ్యారని మండిపడ్డారు. వంశధార, నాగావళి కరకట్టలు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. గృహనిర్మాణ శాఖలో ఏఈ నుంచి పీడీ వరకు 10 రకాల పోస్టులు ఒక్కడే చేయగలడా? అంత సమర్థుడా? అని ప్రశ్నించారు.

వ్యవసాయ మంత్రి ఇలాఖాలో ఎరువుల కొరతా?

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ఎరువులు కొరత ఉండటం సిగ్గుచేటని నందిగాం ఎంపీపీ శ్రీరామ్మూర్తి అన్నారు. కూటమి నాయకులకే ఎరువులిచ్చి మిగిలినవారికి ఎరువులు లేవని చెప్పడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇటువంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదన్నారు. ఎరువులు, ఇతర పథకాలు ప్రజలకందించే విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

- వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవింద్‌లు తిరిగి వారిపైనే మండిపడటం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తే... కూటమి ప్రభుత్వం మాత్రం అడుగడుగునా జెండాలు చూస్తోందని సభ్యులు మండిపడ్డారు.
- గిరిజన విద్యార్థులంటే అధికారులకు ఎందుకంత చులకనని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రశ్నించారు. ఇటీవల గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పిల్లలు అనారోగ్యాలపాలై మరణించినా అక్కడ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.
- రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు సీతారాం మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వంశధార కట్టడాలు కూలుతున్నాయని చెప్పారు. మరమ్మతులు చేసి శివారు ప్రాంతాల వరకు సాగునీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఇరిగేషన్ సమస్యలను వివరించారు.
- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ వంశధార కాలువల వంతెనలకు మరమ్మతులు చేయించాలని కోరారు. గొట్టా బ్యారేజీ శిథిలావస్థకు చేరిందని చెప్పారు.
- మడ్డువలస, నారాయణపురం, నాగావళి నదులపై సాగవుతున్న వాటిపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని శాసన సభ్యులు కోరగా.. ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు ఈఈ చెప్పారు. వంశధారలో భూములు కోల్పోయారని, నిర్వాసితులకు నష్ట పరిహారం అందలేదని సభ దృష్టికి తీసుకురాగా, నష్ట పరిహారం చాలదని కొందరు కోర్టుకు వెళ్లారని ఇరిగేషన్ అధికారులు చెప్పారు.
- వైద్య ఆరోగ్య శాఖపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి సీజనల్ వ్యాధులపై వివరించారు. పక్క జిల్లాలతో పోలిస్తే జిల్లాలో కేసులు తక్కువగానే ఉన్నట్లు చెప్పారు. క్యాన్సర్ పేషెంట్లను ఎన్టీఆర్ వైద్య సేవలో చేర్చాలని ఎమ్మెల్యే రవికుమార్ కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్లు సిరిపురపు జగన్మోహనరావు, సోంపేట ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ కాయల రమణ, ఉమ్మడి జిల్లా మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీచర్ల సర్దుబాటు నోడల్ అధికారిగా మస్తానయ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యలో గందరగోళాన్ని సృష్టిస్తున్న టీచర్ల పని సర్దుబాటుపై శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయుల గ్రీవెన్స్‌ను నిర్వహించేందుకు నోడల్ అధికారిగా వీఎన్ మస్తానయ్య(డైరెక్టర్, ఎస్ఐఈఎంఏటీ)ను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నియమించింది. పునర్విభజన జిల్లాల వారీగా నోడల్ అధికారులను ఉన్నతాధికారులు నియమించారు. దీని ప్రకారం 30 మండలాల పరిధిలో పనిచేస్తున్న టీచర్ల పనిసర్దుబాటు విషయమై వచ్చే గ్రీవెన్స్‌లను స్వీకరించి పరిష్కరిస్తారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు కలిపి నోడల్ అధికారిగా ఎ.సుబ్బారెడ్డి (ఎస్‌పిఎంఓ – రాష్ట్ర సమగ్రశిక్ష ఏపీ) నియమితులయ్యారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


జానకమ్మ మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగు పడి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర గ్రామానికి చెందిన సాడి జానకమ్మ(48) బుధవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో పంట పొలంలో వరినాట్లు వేస్తుండగా పిడుగు పాటుకు గురైంది. ఆమె చిన్న కుమారుడు తేజేశ్వరరావు కాఫీ పట్టుకొని పంట పొలానికి వెళ్లిన సమయంలో విగత జీవిగా పడి ఉన్న తల్లిని చూసి కేకలు వేయడంతో ఇతర పొలాల్లో ఉన్న కూలీలు ఘటనా స్థలానికి చేరుకొని సపర్యలు చేసి ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు భర్త సోమయ్య, ఇద్దరు కుమారులున్నారు. జానకమ్మ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఫోర్జరీ సంతకంతో వంట కార్మికురాలి తొలగింపు

టెక్కలి: తనకు ఆరోగ్యం సరిగ్గా లేదని.. వంట కార్మికురాలిగా పనిచేయలేకపోతున్నానంటూ తీర్మానం రాస్తూ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి అన్యాయంగా తొలగించారని టెక్కలి మండలం బొప్పాయిపురం ప్రాథమిక పాఠశాల వంట కార్మికురాలు లమిడిపల్లి సంతోషి వాపోయారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు బాబురావు తన తల్లి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇటువంటి దుశ్చర్యకు పాల్పడ్డారని బాధితురాలి కుమారుడు రవికుమార్ బుధవారం టెక్కలి మండల విద్యాశాఖాధికారి తులసీరెడ్డికి ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. బొప్పాయిపురం ప్రాథమిక పాఠశాలలో లమిడిపల్లి సంతోషి కొన్నేళ్లుగా వంట కార్మికురాలిగా పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎటువంటి కారణం లేకుండా ఆమెను తొలగించారు. టీడీపీ కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలుగా తనను తొలగించారని భావించి సంతోషి విధులకు వెళ్లడం మానేశారు. ఎటువంటి కారణం లేకుండా తనను ఎందుకు తొలగించారని సంతోషి ప్రశ్నించగా పైనుంచి వచ్చిన ఆర్డర్ అంటూ తప్పించుకున్నారు. తర్వాత మండల విద్యా శాఖ కార్యాలయంలో ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. అనారోగ్య కారణంతో విధుల నుంచి తప్పుకుంటున్నట్లు కార్మికురాలు సంతోషి పేరుతో ఫోర్జరీ సంతకం కలిగిన తీర్మానం బయటపడింది. ఈ తీర్మానం ప్రధానోపాధ్యాయుడు అందజేశారని అధికారులు వెల్లడించారు. ఒక్కసారిగా ఖంగుతిన్న కుటుంబ సభ్యులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈఓ తులసీరెడ్డి వద్ద ప్రస్తావించగా ఇరువురిని పిలిపించి విచారణ చేస్తామని పేర్కొన్నారు.

4 లక్షల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


రామయ్యపేటలో టీకాల శిబిరాన్ని పరిశీలిస్తున్న జేడీ వి.జయరాజ్

కోటబొమ్మాళి: జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల పశువులకు గాలికుంటువ్యాధి నివారణకు ఉచిత టీకాలు మంజూరైనట్లు జిల్లా వెటర్నరీ జేడీ వి.జయరాజ్ తెలిపారు. బుధవారం కోటబొమ్మాళి మండలం పాకివలస, చౌదరికొత్తూరు, మెండపేట, రామయ్యపేట గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ మంద లోకనాథం, కురుడు పశు వైద్యుడు ఎల్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అండగా నిలవాలి



కోల్‌కతాలో జరిగిన ఘటనపై నిందితుల్ని కఠినంగా శిక్షించి బాధితురాలి కుటుంబానికి అండగా నిలవాలి. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి పటిష్టమైన రక్షణ చర్యలు ఉండాలి. ముఖ్యంగా పోలీస్ సిబ్బందితో భద్రత కల్పించాలి.

– ఈశ్వరి, స్టాఫ్ నర్స్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, టెక్కలి

రక్షణ కల్పించాలి



ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి రక్షణ కల్పించాలి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పనిచేసే వైద్య సిబ్బందికి ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలి. రక్షణ చట్టాలు మరింత పటిష్టంగా ఉండాలి.

– పి.రాధ, ఎల్‌టీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, టెక్కలి



శిక్షలు కఠినంగా ఉండాలి



కోల్‌కతా వంటి ఘటనలు అడపాదడపా జరుగుతునే ఉన్నాయి. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలి. తప్పు చేయాలంటే భయం వచ్చేలా శిక్షలు కూడా కఠినంగా ఉండాలి.

– పైడి సునీత, స్టాఫ్‌నర్స్ అచ్యుతాపురం పీహెచ్‌సీ, జలుమూరు

ఆటలపై మాటలు.. నీటిమూటలేనా!

- క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని హామీలిచ్చి మర్చిపోతున్న పాలకులు
- జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం కరువు
- ఇటీవల రాష్ట్రస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగినా పట్టించుకోని మంత్రి
- వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం కప్, ఆడుదాం ఆంధ్రాతో ఏడాదంతా క్రీడా పండగే
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం


సిక్కోలు వేదికగా జరిగిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీల్లో క్రీడాకారుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ:

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల్లో సరికొత్త సంస్కరణలకు నాందిపలికింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొన్న, పతకాలు సాధించిన క్రీడాకారులకు ఆర్థికంగా సాయంచేసి ప్రోత్సహించింది. స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేసింది. అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న వారికి వైఎస్సార్ క్రీడా పురస్కారాలు ప్రదానం చేసింది. వీటిన్నింటికి తోడు క్షేత్రస్థాయిలో క్రీడలను మరింతగా విస్తరించాలని భావించి విలేజ్ స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటు చసింది. సీఎం కప్, ఆడుదాం ఆంధ్రా పేరిట పెద్ద ఎత్తున క్రీడాసంబరాలను నిర్వహించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక క్రీడలను లైట్ తీసుకున్నట్లుంది. ఇందుకు ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఏపీరాష్ట్ర జూనియర్స్ సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీటే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం నయాపైసా సాయం చేయపోగా.. జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలోనే ఉండి కూడా ప్రతిష్టాత్మక స్టేట్‌మీట్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

నత్తనడకన స్టేడియం పనులు..

జిల్లాకే తలమానికంగా గుర్తింపు పొందిన కోడిరామ్మూర్తి స్టేడియం ఆధునికీకరణ పనుల ఒక అడుగు ముందుకు రెండు అడుగుల వెనక్కి అన్న చందంగా తయారైంది. 2016 జూన్ 4న శ్రీకాకుళం కేఆర్ స్టేడియంలో చంద్రబాబు స్వయంగా శిలాఫలకానికి శంకుస్థాపన చేసినప్పటికీ.. పనులను మాత్రం సకాలంలో మొదలుపెట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో పునఃనిర్మాణానికి అవసరమైన రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇంతలో 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలుకాలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 9 నెలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కేఆర్ స్టేడియం పనులు పూర్తిచేస్తామని చెబుతున్నా, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. వర్షాలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పాఠశాలల క్రీడలకు ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు లేకపోతుండటంతో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, పీడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి చేతి చమురు విదుల్చుకుంటున్నారు. జిల్లాలో డీఎస్‌ఏ పరిధిలో డీఎస్‌డీఓతో కలిపి 18 మంది కోచ్‌లు ఉన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 425 మంది వరకు పీడీలు ఉన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా క్రీడాభివృద్ధిపై దృష్టి సారించాలని వీరంతా కోరుతున్నారు.

నేడు జాతీయ క్రీడోత్సవ ర్యాలీ..

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలోని 6.30 గంటలకు ర్యాలీని నిర్వహించనున్నారు. వైఎస్సార్ సర్కిల్(ఏడు రోడ్ల జంక్షన్) నుంచి పాలకొండ రోడ్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు ర్యాలీ కొనసాగనుంది. జిల్లా ఒలింపిక్ సంఘం, క్రీడాసంఘాలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించనున్నారు.


కోడిరామ్మూర్తి స్టేడియం భవన నిర్మాణ పనులు

పేకాడుతూ పట్టుబడిన ప్రముఖులు!

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం కుశాలపురం పంచాయతీ నవభారత్ సమీపంలో ప్రముఖుడి గెస్ట్ హౌస్‌లో పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. అజ్ఞాత వ్యక్తుల సమాచారం మేరకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారి ఆదేశాలతో జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఈ దాడులు చేసినట్లు సమాచారం. దాడి సమయంలో ప్రముఖ వైద్యుడు, జనసేన నాయకుడు, మరొక రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఉపాధ్యాయుడు తదితర ప్రముఖులు ఉన్నట్లు సమాచారం. ఏడుగురు పట్టుపడగా జనసేన నాయకుడు, ప్రముఖ వైద్యుడిని రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని సమాచారం. ఆరుగురు పేర్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, వివరాలు బయట పెట్టకుండా పోలీసులు జాగ్రత్త పడుతున్నారు. వీరి వద్ద నుంచి రూ. 3.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ అంశంపై స్పందించేందుకు పోలీసులు ముందుకు రావడం లేదు. కాగా, నవభారత్‌లోని కొన్ని గెస్ట్ హౌస్‌లలో సంఘ విద్రోహ కార్యక్రమాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మెనూ.. గాడి తప్పెను!

- ఆర్‌జీయూకేటీలో సక్రమంగా అమలు కాని భోజన మెనూ
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు


మెస్ పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాలయాల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ పక్కాగా అమలు కావాలి. నాణ్యమైన పౌష్టికాహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. తక్కువకు కోట్ చేశామని మెనూ సక్రమంగా పాటించకపోతే టెండర్ రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలి. అయితే శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. 4000 మంది విద్యార్థులు చదువుతున్న ఈ క్యాంపస్‌లో కూటమి ప్రభుత్వం వచ్చాక మెనూ గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ మెనూ..

- ఒక్కో విద్యార్థి భోజనానికి రోజుకు రూ.88 ఖర్చు చేస్తూ మెనూ టెండర్ దక్కించుకున్నారు. తక్కువ టెండర్ కావటం వారికి సమస్యగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే నిబంధనల మేరకే మెనూ అమలు తప్పనిసరి.
- ప్రతి ఆది, బుధవారాల్లో చికెన్ పెట్టాలి.
- వారానికి నాలుగు రోజులు గుడ్లు వడ్డించాలి.
- ప్రతి రోజూ పాలు, స్నాక్స్ ఇవ్వాలి.

విద్యార్థులు ఏమంటున్నారంటే..

- భోజనంలో నాణ్యత పాటించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చికెన్ వారానికి ఒక్కసారే పెడుతున్నారని, అది కూడా అనుకున్న పరిమాణంలో వడ్డించడం లేదని చెబుతున్నారు.

- మొత్తం మూడు మెస్‌లు ఉండగా, శివానీ మెస్, ఎస్ఎంపురం క్యాంపస్‌లో ఒక మెస్‌పై ఎక్కువగా విద్యార్థులు ఫిర్యాదులు చేస్తున్నారు.
- రన్నింగ్ వాటర్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని చెబుతున్నారు.
- ఇక్కడి వసతి సమస్య వల్ల ఇంజినీరింగ్ మూడు, నాలుగేళ్ల విద్యార్థులు నూజివీడులో ఉంటున్నారు. అక్కడ ఆహారం కలుషితం కావటంతో ఇక్కడి విద్యార్థులు సైతం ఆందోళన చెందుతున్నారు. స్థానిక విద్యార్థుల్లో కొందరికి గ్యాస్ట్రిక్ సమస్య ఉంది.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మెస్ కమిటీ సభ్యులు

గాడి తప్పిన పాలన..

- కూటమి ప్రభుత్వం వచ్చాక వర్సిటీ ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని ఒత్తిడి ప్రారంభమైంది. దీంతో శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ జూన్ 29న రాజీనామా చేశారు. అయినా రిలీవ్ చెయ్యలేదు. రాజీనామా చేసిన డైరెక్టర్ పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పాలన గాడి తప్పుతోంది.
- అధికారులు నిరంతరం క్యాంపస్‌ను పర్యవేక్షించాలి. చీఫ్ వార్డెన్, వార్డెన్లు, కేర్ టేకర్లు విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. లోపాలు ఉంటే మెస్ కమిటీ సమీక్షించి లోపాలు అధిగమించాలి. విద్యార్థులు ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మెనూ అమలు చేస్తున్నాం..

ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో మెనూ పక్కాగా అమలు చేస్తున్నాం. ఆహారంలో నాణ్యత, కాంట్రాక్టు ఒప్పందం మేరకే భోజనం పెడుతున్నాం విద్యార్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. – కేవీజీడీ బాలాజీ, ఆర్‌జీయూకేటీ క్యాంపస్ డైరెక్టర్

హత్యా రాజకీయాలు అప్రజాస్వామికం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం


కూన ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఎచ్చెర్ల క్యాంపస్: హత్యా రాజకీయాలు అప్రజాస్వామికమని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఫరీదుపేటలో తెలుగుదేశం వర్గీయుల చేతిలో హత్యకు గురైన కూన ప్రసాద్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతుని తండ్రి కూన వెంకటరావుకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజకీయ హత్యలు, దాడులు పెరిగాయని మండిపడ్డారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగించాలని హితవుపలికారు. ప్రజాస్వామ్యంలో అధికారం, పదవులు శాశ్వతం కాదని గుర్తించాలన్నారు. ఎస్పీ దృష్టికి సమస్య తీసుకువెళతానని, పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి నేరంతో సంబంధం ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశాంత జిల్లాలో హత్యా సంస్కృతి మంచిది కాదన్నారు. క్రియాశీల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం హత్యా రాజకీలయాలను ఆపాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, అల్లుశెట్టి ఉమామహేశ్వరరావు, అనకాపిల్లి రామకృష్ణ, సత్తారు గోపి, మొదలవలస కృష్ణ, మొదలవలస సతీష్, సీపాన దిలీప్‌కుమార్, కూన కిరణ్‌కుమార్, మొదలవలస ఫాల్గుణ, సత్తారు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గాయపడిన విద్యార్థిని మృతి


లిఖిత (ఫైల్)

నరసన్నపేట/టెక్కలి/టెక్కలి రూరల్: జాతీయ రహదారిపై గుండివల్లిపేట–కోమర్తి మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని కావులూరి లిఖిత(19) చికిత్స పొందుతూ మృతి చెందింది. టెక్కలి సైనికపురి కాలనీకి చెందిన లిఖిత స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన లిఖితను వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా బుధవారం ఉదయం మృతి చెందింది. తల్లి సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఏఎస్ఐ అసిరినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతి పట్ల సంతాపం

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.లిఖిత మృతి పట్ల బుధవారం కళాశాలలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తో పాటు అధ్యాపకులు, తోటి విద్యార్థులంతా విద్యార్థి లిఖిత మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

సంబరంలో వివాదం.. ఇంటికి నిప్పు

కంచిలి: మండలంలోని చిలకలమెట్ట గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదం చివరికి ఇంటికి నిప్పు పెట్టేవరకు వెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలంత్రకోట పంచాయతీ చిలకలమెట్ట గ్రామానికి చెందిన తాటిపెట్టి చిన్నబాబు కుటుంబం ఈ నెల 27న కంచమ్మతల్లి సంబరం నిర్వహించింది. ఈ సంబరానికి అందర్నీ ఆహ్వానించారు. కార్యక్రమానికి హాజరైన అదే గ్రామానికి చెందిన కటారి దుర్యోధన, పక్క గ్రామమైన ఉప్పరిపేటకు చెందిన శాసనపురి జయరాం మధ్య ఏదో విషయమై వాగ్వాదం జరిగింది. స్థానికులు వెంటనే కలగజేసుకుని సర్దిచెప్పారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున 3.30 గంటలకు జయరాం చిలకలమెట్టలోని దుర్యోధన ఇంటికి పెట్రోల్ బాటిల్‌ను తీసుకెళ్లి ద్విచక్ర వాహనం, ఇంటికి నిప్పంటించాడు. ఈ ఘటనపై దుర్యోధన కంచిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- ఉరి వేసుకుందంటున్న భర్త
- అల్లుడు, అత్త, మామలు హత్య చేశారని ఆరోపిస్తున్న మృతురాలి తల్లి


అనూరాధ(ఫైల్)

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేట శివారులోని శ్రీనివాసా అపార్ట్‌మెంట్ నాలుగో ఫ్లోర్‌లో నివాసముంటున్న వివాహిత బరాటం అనూరాధ(22) అనుమానాస్పదంగా మృతి చెందింది. అనురాధ క్షణికావేశంతో బెడ్‌రూంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని మృతురాలి భర్త, అత్తమామలు చెబుతుండగా.. అనూరాధను హత్య చేశారని తల్లి కిల్లంశెట్టి పద్మావతి, బంధువులు ఆరోపిస్తున్నారు. శ్రీకాకుళానికి చెందిన బరాటం శ్రావణ్‌తో అనూరాధకు గత ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీన వివాహమైంది. శ్రావణ్ నరసన్నపేటలోనే ఫ్యాన్సీ షాపు నడుపుతున్నాడు. పెళ్లిత సమయంలో ఐదు లక్షల వరకూ కట్నం ఇచ్చారు. అనురాధ ప్రస్తుతం రెండు నెలల గర్భిణి. మూడు రోజుల్లో వివాహ వార్షికోత్సవం జరగనుండగా బుధవారం ఉదయం 11 గంటల సమయంలో అనురాధ బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది.

హత్యే అంటున్న మృతురాలు తల్లి..

ఒంటి గంట సమయంలో అనురాధకు ఆరోగ్యం బాగాలేదని ఫోన్ వచ్చిందని, ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె మృతి చెంది ఉందని తల్లి పద్మావతి తెలిపారు. ఇది ఆత్మహత్య కాదని, కావాలనే చంపేశారని తల్లి, మేనమామ శంకర్ తదితరులు ఆరోపించారు. నిత్యం అదనపు డబ్బులు కావాలని చిత్రహింసలు పెట్టేవారని, నెల క్రితం తన నెక్లెస్ అమ్మి రూ. 50 వేలు ఇచ్చానని, ఇంతలోనే ఇలా చంపేస్తారని అనుకోలేదని తల్లి విలపించింది. సమాచారం అందుకున్న నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ లెటర్ తమ కుమార్తె రాయలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అమ్మతో కలిసి బతకాలని ఉంది..

- మనోవేదనతో విద్యార్థి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : 'ఫ్రెండ్స్ అందరితో ఎంజాయ్ చేశాను.. అయినా స్టడీస్‌లో ఇంప్రూవ్ అవ్వలేకపోయా.. మా అమ్మ దగ్గరికి వెళ్లి హ్యాపీగా బతకాలని ఉంది' అంటూ సూసైడ్ నోట్ రాసి జిల్లాకేంద్రంలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు బావాజీమటం వెనుక భాగంలో నివాసముంటున్న కూర్మాపు మాధవరావుకు కుమార్తె ఉష, కుమారుడు భానుప్రకాష్(19) ఉన్నారు. భార్య 2007లో చనిపోయింది. భానుప్రకాష్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. తల్లి చనిపోయినప్పటి నుంచి డిప్రెషన్‌లో ఉంటూ చదువులో రాణించలేక దిగులు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భోజనానికి ఎంతకీ రాకపోవడంతో ఇంట్లో ఉంటున్న దగ్గరి బంధువు సరస్వతి వెళ్లగా.. తలుపు తీయకపోవడంతో కిందకు వచ్చేసింది. బుధవారం ఉదయం మరోసారి పిలిచినా తలుపు తీయకపోవడంతో కార్పెంటర్‌ను పిలిపించి తలుపులు పగులగొట్టించింది. అప్పటికే భానుప్రకాష్ ఉరివేసుకుని కనిపించాడు. చేతిలో సూసైడ్ లెటర్ ఉంది. క్లూస్ టీమ్, పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న షకీన్ ముస్తాక్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరంలో అపార్ట్‌మెంట్‌లో ఎస్‌కే షకీన్ ముస్తాక్(26) అనే వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాక్ పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఆరో యాక్టివ్ ఫార్మా పరిశ్రమలో వెల్డర్‌గా ఆరు నెలలుగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం మనసు బాగాలేదని, డ్యూటీకి రాలేనని తోటి ఉద్యోగులతో చెప్పి తన గదిలతోనే ఉండిపోయాడు. అతనితో పాటు అదే ఆపార్టమెంట్‌లో ఉన్న మరో వ్యక్తితో కాసేపు మాట్లాడి 11.30 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. ఇతనిది పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని పుర్‌బానా మిద్నాపూర్ జిల్లా గర్త కమలాపూర్ గ్రామం. భార్య, కుమార్తె ఉన్నారు. ముస్తాక్ వారంలో రెండు రోజులు డ్యూటీకి వెళ్లకుండా గదిలోనే ఉండిపోతున్నాడని, ఇటీవల ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడిపి విఫలమైనట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ముస్తాక్ బంధువు మోహిద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు.

తొమ్మిది రోజులు మృత్యువుతో పోరాడి..

- మందస కోట ఇనుప దిమ్మె తగిలి వ్యక్తి మృతి


జగదీశ్వరరావు (ఫైల్)

కాశీబుగ్గ: మందస రాణీవారికోటకు సంబంధించి ఐరన్ పిల్లర్ విరిగిపడి వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన మందస గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మందస గ్రామానికి చెందిన మేస్త్రి బూరగాపు జగదీశ్వరరావు (56) ఈ నెల 18న రాణికోట ముందు నుంచి బైక్‌పై వెళ్తుండగా గాలి వానకు కోటలోని ఐరన్ పిల్లర్ దూసుకొచ్చింది. ఈ ఘటనలో జగదీశ్వరరావు మెడ, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం పలాస సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం తీసుకెళ్లి అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. తొమ్మిది రోజుల పాటు మృత్యువుతో పోరాడి బుధవారం వేకువజామున మరణించాడు. జగదీశ్వరరావుకు భార్య రాజేశ్వరి, కుమారుడు కిషోర్, కుమార్తె దివ్య ఉన్నారు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, రాణికోట శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, అధికారులు చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు కిషోర్ కోరారు.


మందస కోట